తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

● జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక

సూర్యాపేట, నవంబర్ 2 : గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేందర్‌రావు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 1వ(ఆర్థిక, ప్రణాళిక) 2వ(గ్రామీణాభివృద్ధి) 4వ(విద్య, వైద్యం), 7వ (పనులు) స్థాయి సంఘాల సమావేశం జడపీ చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడైన తాగునీటి సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. జడ్పీ సీఈఓ సురేశ్, జడ్పీటీసీలు దావుల వీరప్రసాద్‌యాదవ్, సైదిరెడ్డి, ఎం.కృష్ణకుమారి, దామోదర్‌రెడ్డి, పుల్లారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేంధర్‌రావు

బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ప్రజలందరికీ భరోసా

● మంత్రి జగదీశ్‌రెడ్డి
సతీమణి సునీత

సూర్యాపేటటౌన్, నవంబర్ 2 : బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రజలందరికీ భరోసానిస్తుందని మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత అన్నారు. గురువారం పట్టణంలోని 11, 33వ వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ పార్టీ మ్యానిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి జగదీశ్‌రెడ్డిని మూడోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. గతంలో ఎన్నడూ జరుగని అభివృద్ధిని తొమ్మిదిన్నరేండ్లలో చేసి చూపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకులు ఎస్.కె.సల్మామస్తాన్, కొండపల్లి భద్రమ్మ, కరుణశ్రీ, మీలా వంశీ, నూకల వెంకట్‌రెడ్డి, వాండుడోతు పద్మ పాల్గొన్నారు.

సూర్యాపేటటౌన్ : 11వ వార్డులో బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత

మంత్రి జగదీశ్‌రెడ్డితోనే సూర్యాపేటలో ప్రశాంత వాతావరణం..

సూర్యాపేట రూరల్ : మంత్రి జగదీశ్‌రెడ్డి పాలనలో సూర్యాపేట నియోజక వర్గంలో ఎలాంటి ఘర్షణలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు జీవిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి మంత్రిని భారీ మెజార్టీతో గెలిపించాలని జడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. మండలంలోని లక్ష్మీతండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. సర్పంచ్ సూర్యానాయక్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్యాపేటరూరల్ : లక్ష్మీతండాలో ఎన్నికల ప్రచారం చేస్తున్న జడ్పీటీసీ భిక్షం

ఓటు కోసం 27,037 మంది దరఖాస్తు

సూర్యాపేట, నవంబర్ 2 : తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం ఓటు హక్కు కోసం చివరి అవకాశం కల్పించగా జిల్లా వ్యాప్తంగా 27,037 మంది ఫామ్-6 ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. సెప్టెంబర్ 20 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 5,892 మంది, కోదాడ-5,997, సూర్యాపేట-7,190, తుంగతుర్తిలో 7,945 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు 13,520 దరఖాస్తులను బీఎల్ఓలు పరిశీలన చేయగా వాటిలో 1,344 దరఖాస్తులను తిరస్కరించారు. 12,176 దరఖాస్తుదారులకు ఓటు హక్కు కల్పించారు. 13,517 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. తొలగింపుల కోసం ఫామ్-7 ద్వారా 2,154, ఫామ్-8 ద్వారా 7,485 దరఖాస్తులు రావడం జరిగింది. ఈ మూడు విభాగాల్లో 36,676 దరఖాస్తులు వచ్చాయి. వాటిని విచారణ చేసిన అనంతరం ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

బొడ్రాయిబజార్, నవంబర్ 2 : జిల్లా కేంద్రంలోని విశ్వవ్యాప్త పిరమిడ్ ధ్యాన కేంద్రం పక్కన ఉన్న డివిజనల్ ఇంజినీర్ ఎలక్ట్రికల్ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవ సమావేశం నిర్వహిస్తున్నట్లు డివిజనల్ ఇంజినీర్ ఎలక్ట్రికల్ ఆపరేషన్ ఎ.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

సమన్వయంతో పని చేయాలి

● ఎంపీపీ కుమారి

చివ్వెంల, నవంబర్ 2 : ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని ఎంపీపీ ధరావత్ కుమారీబాబూనాయక్ అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల నివేదికలు సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, ఎంపీఓ గోపి, ఏఓ ఆశాకుమారి, ఎంఈఓ గోపాల్‌రావు, ఏఈఈలు లింగానాయక్, మౌనిక, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కుమారీబాబూనాయక్

నేటి నుంచి నామినేషన్లు

- ఈ నెల 10 వరకు స్వీకరణ.. 13న స్క్రూటిని, 15న ఉపసంహరణ
- 30న పోలింగ్.. డిసెంబర్ 3న కౌంటింగ్
- పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు
- అభ్యర్థుల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు

సూర్యాపేట ఆర్‌ఓ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట, (నమస్తే తెలంగాణ)/సూర్యాపేట, నవంబర్ 2 : తెలంగాణ శాసన సభ ఎన్నికల తొలి ఘట్టం నామినేషన్ల ప్రక్రియకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 3న (శుక్రవారం) నాడు ఎన్నికల సంఘం తెలంగాణ ఎన్నికల ప్రక్రియకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నది. నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నది. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనున్నది. రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 5వ తేదీ (ఆదివారం) మినహా మిగిలిన 7 రోజుల పాటు నామినేషన్లు స్వీకరించనున్నారు. జిల్లాలో సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నాలుగు నియోజకవర్గాలు ఉండగా తుంగతుర్తి మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంతో పాటు మిగిలిన చోట్ల ఆర్డీఓ కార్యాలయాల్లో రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. నాలుగు నియోజక వర్గాల్లో నామినేషన్ల స్వీకరణ కోసం సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన నామినేషన్, ఫారం-26 అఫిడవిట్‌ను ప్రింట్ తీసుకుని అభ్యర్థి లేదా అతను ప్రతిపాదించిన వ్యక్తి గానీ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమర్పించవచ్చని చెప్పారు. కాగా ఆన్‌లైన్‌లో నామినేషన్ చేయలనుకునే వారు ఎన్నికల సంఘం వారి సువిధ పోర్టల్‌లో ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల బరిలో నిలవాలనుకునే అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో, నిబంధనల మేరకు అన్ని ధ్రువపత్రాలు సమర్పించి నామినేషన్ పత్రాలు అందించాలని కలెక్టర్ సూచించారు.

సూర్యాపేట నియోజక వర్గం నామినేషన్లను స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. నామినేషన్ల ప్రక్రియ నియోజక వర్గ ఎన్నికల అధికారి, స్థానిక ఆర్డీఓ వీరబ్రహ్మచారి ఆధ్వర్యంలో కొనసాగనున్నది. సూర్యాపేట ఆర్డీఓ కార్యాలయం చుట్టూ వంద మీటర్లు 144 సెక్షన్ విధించారు. సూర్యాపేట డీఎస్పీ ఆధ్వర్యంలో సుమారు 70 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థితో పాటు కేవలం నలుగురిని మాత్రమే లోనికి అనుమతిస్తారు. అభ్యర్థి లేకుంటే అతని తరుపున నామినేషన్ వేయడానికి వస్తే అతని తరుపున నలుగురిని మాత్రమే అనుమతించడం జరుగుతుంది. నామినేషన్ ప్రక్రియలో ర్యాలీలను 200 మీటర్ల దూరంలోనే ఆపడం జరుగుతుంది. వంద మీటర్ల దూరం వరకు కేవలం 3 వాహనాలను అనుమతించనున్నారు. అక్కడి నుంచి అతను నడుచుకుంటు లోపలికి వచ్చి నామినేషన్ సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థుల నామినేసన్ పరిశీలన, నగదు చెల్లింపులు వంటి వాటికి వేర్వేరుగా డెస్క్ లను ఏర్పాటు చేశారు. నామినేషన్ వేసిన వెంటనే పత్రాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ఎన్‌కోర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుంది. నామినేషన్‌లో అభ్యర్థులు ఆస్తులు, కేసుల వివరాలతో పాటు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అని అఫిడవిట్ రూపంలో అందించనున్నారు.

పటిష్ట బందోబస్తు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండగా నాలుగు నియోజక వర్గాల పరిధిలోని రిటర్నింగ్ కార్యాలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం. కార్యాలయాల వద్ద 100 మీటర్ల లోపు వరకు అభ్యర్థులతో పాటు మరో నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుంది. ఆయా రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్లు ర్యాలీలు తీస్తే ముందస్తు అనుమతులు తప్పనిసరి. ఆర్‌ఓ కార్యాలయాల వద్ద సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశాం. నామినేషన్లు స్వీకరించే కేంద్రాల వద్ద ఆర్మ్‌డ్ ఫోర్స్, సివిల్ పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం.

– రాహుల్ హెగ్డే, ఎస్పీ, సూర్యాపేట

నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి

సూర్యాపేట శాసన సభ స్థానానికి సంబంధించి నామినేషన్ల ప్రక్రియ సూర్యాపేట ఆర్డీఓ కార్యాలయంలో కొనసాగనున్నది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పటిష్ట బందోబస్తు నడుమ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. నేటి నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుండగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకారం ఉంటుంది. నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థుల అనుమానాలు తీర్చేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశాం.

– వీరబ్రహ్మచారి, నియోజకవర్గ ఎన్నికల అధికారి

నామినేషన్ల ప్రక్రియలో జాగ్రత్తగా ఉండాలి

● కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట : నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి పోరపాట్లు జరుకుండా జాగ్రత వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అదికారులను ఆదేశించారు. గురువారం ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి సూర్యాపేట ఆర్డీఓ కార్యాలయంలోని ఆర్‌ఓ కార్యాలయంను ఆయన పరిశీలించి మాట్లాడారు. పని విభజన ఎక్కడిక్కడ జరుగాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట సూర్యాపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీరబ్రహ్మచారి, డీఎస్పీ నాగభూషణం, తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ఉన్నారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు..

శాసన సభ స్థానానికి నామినేషన్ వేసే అభ్యర్థులకు నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి అనుమానాలు ఉన్న ఆర్డీఓ కార్యాలయం కింద హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ముందు రోజు అభ్యర్థులు గానీ, వారి సంబందీకులు గానీ వివరాలు తెలుసుకోవచ్చు. సందేహాలను ఈ హెల్ప్ డెస్క్‌లో నివృత్తి చేసుకోవచ్చు. వీరితో పాటు అకౌంటింగ్ టీమ్, సీ-విజల్, వీవీటీ టీమ్‌లు అందుబాటులో ఉండనున్నాయి.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

● డీఎస్పీ నాగభూషణం

చివ్వెంల, నవంబర్ 2 : ఈ నెల 30న జరుగనున్న సాధారణ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని డీఎస్పీ నాగభూషణం అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు కుడకుడలో పోలీస్, కేంద్ర పారా మిలటరీ బలగాల సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐలు విష్ణుమూర్తి, సాయిరామ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మండల కేంద్రంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింటు అయిన చేమూరి నవీన్ కుమార్, తండ్రి వెంకటేశ్వర రావు, రామపురం గ్రామము, చిలకూరు మండలం, సూర్యాపేట జిల్లా నివాసి మీరకు దిగువ ప్రకటన ద్వారా సమస్త ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు నందు చూపబడిన నివాస గృహమునకు యజమాని అనియు, ఇట్టి గృహమును నా క్లయింటు శ్రీమతి రత్నాల రమణ, భర్త యాదగిరి అనువారి నుండి దస్తావేజు నెం.6931/2023 (ఎస్.ఆర్.ఓ. కోదాడ) ద్వారా క్రయం పొందినాటి నుండి సంపూర్ణ స్వాధీన హక్కుదారుగా యున్నారనియు, ఇట్టి ఆస్తిని శ్రీమతి రత్నాల రమణ గారు దస్తావేజు నెం.715/2020 (ఎస్.ఆర్.ఓ. కోదాడ) ద్వారా శ్రీ మొహమ్మద్ అబ్దుల్ అజీమ్ గారి నుండి క్రయం పొందియున్నారనియు, సదర శ్రీ మొహమ్మద్ అబ్దుల్ అజీమ్ గారు దస్తావేజు నెం.4430/2018 ద్వారా శ్రీమతి పాశం అపర్ణ గారి నుండి భూమి స్థలమును క్రయం పొందియున్నారనియు, మరియు ఇట్టి దస్తావేజు నెం.4430/2018ను నా క్లయింటు ఏదైనా ఆర్థిక సంస్థ నుండి ఋణము పొందు నిమిత్తము జిరాక్సు తీయించుకొనుటకు వెళ్ళిన సమయములో పోయినదని, ఇట్టి దస్తావేజు దొరుకుట కొరకు చేసిన అన్ని ప్రయత్నములు ఫలించలేదనియు, మరియు ఇట్టి దస్తావేజుపై ఎలాంటి తనఖాలు, పాలియంచాయితీలు, ఇతరత్రా ఎటువంటి వ్యవహారములు లేవనియు మరియు ఇట్టి దస్తావేజు నెం.4430/2018 ఎవరికైనా దొరికిన యెడల లేదా ఎవరికైనా ఏ విధమైన న్యాయపరమైన హక్కులు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన నాల్గు (7) రోజులలో ఈ క్రింది చిరునామాదారున అధారయుక్తముగా సంప్రదించవలెననియు, గడువు తరువాత వచ్చు ఏ విధమైన అభ్యంతరాలు, అక్షేపణలు నా క్లయింటునకు బద్దుడిని చేయజాలవనియు, మరియు సదర దస్తావేజు నెం.4430/2018 పోయినట్లుగా భావించి, సంబంధిత ఎస్.ఆర్.ఓ. కార్యాలయము నుండి నకలు పొంది ఋణ ప్రయత్నములు చేయుటకు నా క్లయింటు సన్నద్ధమై యున్నాడనియు తెలియజేయునైది.

షెడ్యూలు

నల్లగొండ జిల్లా రిజిస్ట్రారు వారి అజ్మాయిషీకి లోబడి కోదాడ సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయాధికార పరిధిలోయున్న సూర్యాపేట జిల్లా, కోదాడ మండలం, కోదాడ మున్సిపాలిటీ బ్లాక్ నెం.19, తమ్మరబండపాలెం రెవిన్యూ లిమిట్సులోని సర్వే నం.374/ఆ4 మిం.లె. ప్లాట్ నెం.13లో చ.గ.266.66లలో నుండి దక్షిణం వైపున చ.గ.190ల & ప్లాట్ నెం.4లో చ.గ.278.88లలో నుండి ఉత్తరం వైపున చ.గ.9.5ల ఇలా ఏకప్రదేశముగా యున్న చ.గ.199.5 (స.మీ. 166.782) లలోని ఇంటి నెం.6-137/1/ఎ/ఎ/1, అస్సెస్‌మెంట్ నెం.1180202285 దాఖలా RCC SFT GF లుగా యున్న ఇల్లు, కరంటు వగైరా అన్ని వసతులతో సహా విక్రయ అస్తికి హద్దులు:

ఉత్తరం: ప్లాట్ నెం.13లో మిగిలిన స్థలం, దక్షిణం: 30 అడుగుల మున్సిపాలిటీ రోడ్డు, తూర్పు: ప్లాట్ నెం.4లో మిగిలిన స్థలం, పడమర:24.0 మున్సిపాలిటీ రోడ్డు

తేదీ:03-11-2023
ప్రదేశం: కోదాడ

సం/-(శ్రీనివాసుల శ్రీనివాసు)
బి.ఎ., బి.యల్
అడ్వకేట్, కోదాడ
సెల్ నెం.8500240025